క్లుప్తంగా

నేడు, రేపు యథావిధిగా రిజిస్ట్రేషన్లు

పీలేరు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెలవు దినాలైన ఆదివారం, సోమవారం రెండు రోజులు కూడా యథావిధిగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయని పీలేరు సబ్ రిజిస్ట్రార్ శివకుమారి తెలిపారు. గతంలో సెలవు దినాల్లో రిజిస్ట్రేషన్లకు రూ. 5 వేలు ఫీజు విధించే వారమని, అయితే ప్రస్తుతం సెలవు ఫీజు మినహాయిస్తూ కేవలం సాధారణ స్టాంప్ డ్యూటీతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. క్రయ విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 130 మంది ఎంపిక

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో శనివారం వివిధ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 130 మంది ఎంపికై నట్లు వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్, బిజినెస్ డెవలప్‌మెంట్, ప్రొడక్షన్ అసెంబ్లింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఎంపిక చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మోహన్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ దరఖాస్తుకు గడువు పొడిగింపు

కేవీపల్లె : ఏపీ గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఏప్రిల్ 6వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా కోఆర్డినేటర్, గ్యారంపల్లె ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చెన్నకేశవులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశం తోపాటు 6,7,8వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, డిగ్రీ మొదటి సంవత్సరం బీఏ, బీఎస్సీ, బీకాం ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్షలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 8712625076 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన

రామసముద్రం : రామసముద్రంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్త వహించాలని ఆటోడ్రైవర్లకు, వాహన డ్రైవర్లకు ఎస్‌ఐ రవికుమార్ శనివారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు ఉంటాయన్నారు. వాహనాలను విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ పార్కింగ్‌చేసి పాదచారులకు, వాహనాలకు అంతరాయం కలిగిస్తే జరిమానాతో పాటు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణదారులు కూడా విచ్చలవిడిగా వాహనాలను రోడ్డుకు అడ్డంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వాహనాలను పార్కింగ్ చేయకుండా చూసుకోవాలన్నారు. లేకపోతే దుకాణదారులపై చర్యలు ఉంటాయన్నారు.

నిబంధనలు పాటించాలి

బి.కొత్తకోట: బి.కొత్తకోట: నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సీఐ జీవన్ గంగనాథ్‌బాబు అన్నారు. శనివారం బైక్‌లు నడుపుతున్న మైనర్లను, వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు రప్పించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లు వాహనాలు నడిపే ప్రమాదాలకు కారణమైతే వారితోపాటు కుటుంబీకులపైనా చట్టపరమైన చర్యలు ఉంటాయని వివరించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు బైక్, ఇతరా వాహనాలు నడపడానికి ఇవ్వరాదని స్పష్టం చేశారు. తర్వాత ఆటోస్టాండ్ వద్దకు వెళ్లి ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి ఆటోలు నడపరాదన్నారు.

పన్ను వసూళ్లు సరే...అభివృద్ధి ఏదీ?



పోడియం ఎదుట బైఠాయించి నిరసన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల నిరసన



కౌన్సిలర్ల నిరసనపై కమిషనర్ ప్రమీలను వివరణ కోరుతున్న ఎమ్మెల్యే

- వార్డుల్లో పనులు చేయడం లేదని కౌన్సిల్ సభ్యుల ఆగ్రహం
- అధికారుల తీరుకు నిరసనగా పోడియం ఎదుట బైఠాయింపు
- ప్రొటోకాల్ పాటించకపోగా, కనీస గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన

మదనపల్లె : పట్టణంలో పన్ను వసూళ్లపై మున్సిపల్ అధికారులకు ఉన్న శ్రద్ధ, వార్డుల్లో అభివృద్ధి పనులు చేయించడంపై లేదని వైఎస్సార్ సీపీ కౌన్సిల్ సభ్యులు ధ్వజమెత్తారు. శనివారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశం నిర్వహించారు. రెండు అజెండాల్లోనూ దాదాపు 23 అంశాలు కౌన్సిల్ అంగీకారం కోసం సభ్యుల ముందు ఉంచారు. సమావేశం ప్రారంభంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ...పట్టణ ప్రజలకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని, ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో.. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు కలగకుండా కొత్తగా 15 బోర్లు వేశామన్నారు. అలాగే సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వాటర్‌ట్యాంకర్ల ద్వారా సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వం పట్టణంలో ఇంటింటి చెత్తసేకరణ జరుపుతున్న 15 క్లాప్ వాహనాలను నిలిపివేయడంతో పారిశుధ్య నిర్వహణలో సమస్యలు తలెత్తుతున్నాయని, సకాలంలో చెత్తసేకరణ జరపలేకపోతున్నామన్నారు. ఏప్రిల్ నుంచి సీఎఫ్‌ఎంఎస్ విధానాన్ని ఎత్తివేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అభివృద్ధి పనులు ఊపందుకోవచ్చనే ఆశాభావం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ ఫర్జానారఫీ మాట్లాడుతూ..గాంధీరోడ్డు ఆక్రమణలపై 5 కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావిస్తున్నప్పటికీ అధికారులు తీసుకున్న చర్యలపై తెలపాలని కోరారు.

సమస్యలపై కౌన్సిలర్ల ఆవేదన

6వవార్డు కౌన్సిలర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. పట్టణంలో 35వార్డులు ఉంటే, అధికారులు కొన్నింటికి కోట్ల నిధులు కేటాయిస్తూ, కొన్నింటిపై నిర్లక్ష్యం కనపరుస్తున్నారన్నారు. 48నెలల తన పదవీకాలంలో కేవలం ఎస్సీ,ఎస్టీ నిధులు..రూ.16లక్షలు, 14వఫైనాన్స్ నిధులు రూ.10లక్షలు తప్ప ఒక రూపాయి జనరల్ ఫండ్ నుంచి ఖర్చుచేయలేదన్నారు. పట్టణంలోని 35వార్డుల్లో నాలుగేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు వార్డులవారీగా తెలపాలని కోరారు. దీంతో మరో కౌన్సిలర్ రాజేష్, అతడికి మద్దతుగా అధికారులు తమ వార్డుల్లో అభివృద్ధి పనులు చేసేందుకు సహకరించడం లేదన్నారు. కేవలం ఒక కల్వర్టు నిర్మించి చేతులు దులుపేసుకున్నారన్నారు. కౌన్సిలర్ వెంకటరమణ మాట్లాడుతూ..ఎమ్మెల్యే టెంకాయకొట్టి ప్రారంభించిన పనులు జరగలేదని చెప్పుకొచ్చారు. దీంతో ఒక్కసారిగా సమావేశంలో అలజడి రేగి, వైఎస్సార్ సీపీ సభ్యులు అజెండాను ఆమోదించేది లేదంటూ వాదులాటకు దిగారు. కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాకపోవడంతో సమస్య తలెత్తుతోందని, సీఎఫ్‌ఎంఎస్ విధానం ఎత్తేశాక బిల్లులు క్లియర్ అయితే పనులు చేయిస్తామన్నారు. కమిషనర్ సమాధానంతో సంతృప్తి చెందని కౌన్సిలర్లు పదిరోజుల్లో పనులకు సంబంధించి నివేదికలు ఇవ్వాలని కోరారు.

శ్మశాన వాటిక నిధులపై..

మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ.. శ్మశానవాటికలకు కేటాయించిన నిధులపై ప్రశ్నించారు. పట్టణంలో నీళ్ల ఉండీ ఇవ్వలేని దుస్థితి నెలకుందని, కొత్తగా బోర్లు వేసి నెలరోజులు అవుతున్నా, కనెక్షన్లు ఇవ్వడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల సమస్యలపై సకాలంలో స్పందిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయి సిబ్బందిలో చలనం లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు.

ఎమ్మెల్యే ఎదుట కౌన్సిలర్ల నిరసన

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా, మధ్యలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వచ్చారు. అప్పటికే వాడివేడి మీద ఉన్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు...ఎమ్మెల్యే గత సమావేశంలో చెప్పినట్లుగా వార్డుల్లో తమకు కనీస ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సమక్షంలో పోడియం ఎదురుగా కింద కూర్చుని అధికారుల తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. అంతకుముందు 6వవార్డు కౌన్సిలర్ ప్రసాద్‌బాబు కళ్లకు నల్లరిబ్బన్ కట్టుకుని అజెండా కాపీలను చించి పడేశారు. కౌన్సిలర్లకు మర్యాద లేనప్పుడు, అజెండాను తాము ఆమోదించేది లేదంటూ తిరస్కరించి సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. దీంతో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర అజెండాలు రెండూ ఆమోదం పొందలేదు.

సాహితీ వసంతానికి కవికుల స్వాగతం

–నేడు ఉగాది వేడుకలు, కవి సమ్మేళనం

మదనపల్లె సిటీ: మావి చివుర్లు తిని వచ్చే మత్త కోయిలలు.. వేదికలపై కళాత్మక వీరవిహారం చేసే కవి మత్తేభాలు.. నేనూ ఓ కవిత విసురుతానని సరదా తీర్చుకునే తూనీగలు.. అనువుగా ఇలా వచ్చి అలా వెళ్లిపోయే సీతాకోకచిలుకలు.. ఒకటేమిటి .షడ్రుచి భరితమూనవి కవి సమ్మేళనాల మేళవింపుల వేదిక మదనపల్లె రచయితల సంఘం (మరసం). మరో యుగానికి ఆహ్వానం పలుకుతూ 26 ఏళ్లు పూర్తి చేసుకుని 27వ ఏటాలోకి అడుగిడుతుంది. ఆదివారం ఉగాది పండుగ రోజున 27వ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. ఇంతింతై వటుడింతయై అన్నట్లు తొలినాళ్లలో జిల్లా స్థాయి కవులతో ప్రారంభమై నేడు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది. 1997 బీటీ కాలేజీ రిటైర్డు అధ్యాపకులు మల్లెల గురవయ్య, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు కరణం బాలసుబ్రమణ్యంపిళ్లై,సీనియర్ జర్నలిస్టు పురాణం త్యాగమూర్తిశర్మ, తొలి మహిళా న్యూస్‌రీడర్ జోళిపాలెం మంగమ్మ, కేంద్రసాహితీ అవార్డు గ్రహీత వల్లంపాటి వెంకటసుబ్బయ్య తదితరులు తన మిత్రబృందంతో కలిసి స్థానిక బెంగుళూరు రోడ్డులోని జిజ్ఞాసభవనలలో సంస్థను నెలకొల్పారు. ఈ 26 ఏళ్లల్లో ప్రతి ఏడాది ఉగాది రోజున కవి కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు ఎంతో మంది కవులను ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం మరసం అధ్యక్షులుగా ఇంజనీర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా లింగాల యుగంధారాచారి వ్యవహరిస్తున్నారు.

పండుగల సందడి

పీలేరు రూరల్ : ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని పట్టణంలో సందడి నెలకొంది. ఉగాది పండుగకు కావల్సిన పూలు, పండ్లు, ఇతర సామగ్రి కొనుగోలుకు పెద్ద ఎత్తున బజారుల్లో కన్పించారు. వివిధ దుకాణాల వద్ద సందడి నెలకొంది.

చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు ప్రారంభం



జ్యోతులతో ఆలయం వద్ద మహిళలు

మదనపల్లె సిటీ: శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని ఆలయంలో ఉదయం గణపతి హోమం నిర్వహించారు. అమ్మవారిని వెండి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. జ్యోతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. రింగ్‌రోడ్డు, మార్కెట్‌యార్డు,మాయబజారు ప్రాంతాల్లో అమ్మవారి కటౌట్లు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల కోసం ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు. సాయంత్రం మహిళలు పెద్ద ఎత్తున దీలు, బోనాలతో (జ్యోతులు) అమ్మవారికి ఆలయం చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం ఎదుట దీపాలు వెలిగించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పురాణం చంద్రశేఖర్, రత్నమయ్య, పవన్ కుమార్,ఉప్పు రామచంద్ర, మోడం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్సియల్ బిల్డింగ్స్‌లో వ్యాపార కార్యకలాపాలు

– మున్సిపల్ కమిషనర్‌కు బహుజన్ యువసేన ఫిర్యాదు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీవైఎస్ నాయకులు

మదనపల్లె : పట్టణంలో రెసిడెన్షియల్ బిల్డింగ్ కింద అనుమతులు పొంది, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాటిలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ కొందరు మున్సిపాలిటీకి కోట్లలో నష్టం కలిగిస్తున్నారని బహుజన్ యువసేన అధ్యక్షులు పునీత్ ఆరోపించారు. శనివారం మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీలను కలిసి అక్రమ అనుమతులతో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న భవన యజమానులకు నోటీసులు జారీచేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ...పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు రెసిడెన్షియల్ బిల్డింగ్స్ కింద భవన అనుమతులు పొంది, వాటిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్‌లు నిర్వహిస్తూ మున్సిపాలిటీకి కోట్ల రూపాయల పన్ను ఎగవేస్తున్నారన్నారు. అలాగే ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యం, బహుళ అంతస్థుల భవన యజమానులు తమ స్థలాన్ని విడిచిపెట్టి, ప్రభుత్వ మున్సిపల్ స్థలంలో రోడ్డుకు అడ్డంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటుచేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారన్నారు. ప్రభుత్వస్థలాల్లో విచ్చలవిడిగా బంకులు, టీహోటళ్లు ఏర్పాటుచేసినప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్ స్థలాల ఆక్రమణలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోకుంటే, బీవైఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు హరీష్, ఆది, శశికుమార్, జిలానీ, బాలకృష్ణ, శ్రీనివాసులు, జగదీష్, వినయ్, తారక్, ఉదయ్, గౌతమ్, సాయి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పుంగనూరురోడ్డులోని కాలేజీలో ప్రోగ్యోత్సవ్-2కె 25, అనోఖ-2కె25, అథర్వ-2కె25 బ్యానర్ల కింద కార్యక్రమం నిర్వహించారు. వివిధ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనువర్తనాలను వివరించారు. ఈ ఉత్సవంలో పేపర్ ప్రజెంటేషన్ పోటీలు, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు, సాంకేతిక క్విజ్‌లతో సహా అనేక రకాల ఉత్తేజకరమైన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, డీన్ అకడమిక్స్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో ఉపవాసదీక్షాపరులకు భోజనం అందిస్తున్న నిసార్‌అహ్మద్

మదనపల్లె : ఆధ్యాత్మికతతో నిర్వహించే ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ప్యారానగర్ సల్మాన్ పార్శి మసీదులో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లిం పెద్దలను, మసీదు ఇమామ్‌లను మెహరుమాతో సన్మానించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆధ్యాత్మికతతో చేసే ఏ పని అయినా మనసుకు సంతోషాన్ని ఇస్తుందని, అదే ఆధ్యాత్మికతతో ప్రజా సేవ కూడా చేయడం ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలన్నారు. ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో ప్రత్యేకతతో కూడుకున్నదన్నారు. ఈమాన్, నమాజ్, రోజా, జకాత్, హజ్ అనేవి ఇస్లాం మతానికి మూలస్తంభాలని, ప్రతి ముస్లిం ఈ ఐదుసూత్రాలను రంజాన్‌మాసంలో పాటించడాన్ని గొప్ప అవకాశంగా భావిస్తారని వెల్లడించారు. అనంతరం ఉపవాస ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు ఖర్జూరం తినిపించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సలీం, ఎస్.ఏ.కరీముల్లా, యూనస్, నూర్ మొహిద్దీన్, తాజ్, షానవాజ్, జాబీ పాల్గొన్నారు.

రాయలసీమ వ్యాప్తంగా టౌన్‌బ్యాంక్ సేవలు



మాట్లాడుతున్న చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్

మదనపల్లె : పట్టణంలో వందేళ్ల ఘనచరిత్ర కలిగిన ది మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్‌ను రాయలసీమ వ్యాప్తంగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ తెలిపారు. శనివారం పట్టణంలోని ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో టౌన్‌బ్యాంక్ సాధారణ మహాజనసభ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ మాట్లాడుతూ టౌన్‌బ్యాంక్ వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా మే మెదటివారంలో మూడురోజుల పాటు శతవార్షిక వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. టౌన్‌బ్యాంక్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ సహకార చట్టం 1964 ప్రకారం కార్యకలాపాలు సాగిస్తోందని, త్వరలో ఆంధ్రప్రదేశ్ మ్యూచువలీ ఎయిడెడ్ సహకార చట్టం 1995 పరిధిలోకి మార్చేందుకు బ్యాంకు పాలకవర్గం ఆమోదించిందన్నారు. మహాజన సభలో సభ్యుల అంగీకారం కోసం తీర్మానాన్ని ప్రవేశపెడితే, ఏకగ్రీవంగా ఆమోదించడం శుభపరిణామమన్నారు. బ్యాంక్ సీఈఓ పీ.వి. ప్రసాద్ బ్యాంకు ఆర్థిక ప్రగతిని వివరించారు. టౌన్ బ్యాంక్‌కు మొబైల్ బ్యాంకింగ్ సదుపాయం కోసం రిజర్వ్‌బ్యాంక్ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ భాస్కర్‌కుమార్, డైరెక్టర్లు రవికాంత్, రవీంద్రనాథ్, ముక్తియార్‌ఖాన్, రాటకొండ సోమశేఖర్, నాదెళ్ల వెంకటేశ్వర ప్రసాద్(శివ), ఆకులకృష్ణమూర్తి, దేవేంద్రబాబు, సర్దార్‌ఖాన్, నిరంజన్‌కుమార్, ఆర్.భాస్కర్, ప్రొఫెషనల్ డైరెక్టర్లు కే.ఎస్.ఎన్.ప్రసాద్, కోటేశ్వరరావు, మేనేజర్ జయచంద్రనాయుడు, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండుగలు సంతోషంగా జరుపుకోవాలి



నిసార్ అహ్మద్ | పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి | చింతల రామచంద్రారెడ్డి

మదనపల్లె /బి.కొత్తకోట/కలికిరి(వాల్మీకిపురం): ప్రజలు సంప్రదాయాలను గౌరవిస్తూ, ఐక్యతను చాటుతూ తెలుగు సంవత్సరాది ఉగాది, పవిత్ర రంజాన్ పండుగలను ఘనంగా జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శనివారం నియోజకవర్గ ప్రజలకు ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ప్రతిఇంట నూతన ఏడాది ఉగాది విశ్వావసు నామ సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటున్నట్టు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉగాది పర్వదినాన్ని అందరు సంతోషం జరుపుకుని, సంప్రదాయాలను పాటించాలన్నారు. అలాగే ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పీలేరు నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డివిశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.